క్లుప్తంగా

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం మునగపాకలోని నందీశ్వర ప్రాంగణ పరిసరాల్లో చెత్త తరలింపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బుట్టల్లో వేసుకోవాలన్నారు. ఇంటి ముందు నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంతో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి, మునగపాక గ్రామాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు వరాహావతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు.ఆయా గ్రామాల్లో భక్తులు జగన్నాథున్ని దర్శించుకొని పూజలు చేశారు. జూలై 6వ తేదీన జగన్నాథుని పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం నారాయణపురంలో రూ. 5 కోట్లతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సామాజిక అవసరాలు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్టీయూ కృషి



గోపినాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి: ఉపాధ్యాయుల సమస్యలపై నిత్యం పీఆర్టీయూ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు, నూతన ప్రభుత్వంలో నిరుద్యోగులకు డీఎస్సీ మోడల్ టెస్టులు, ప్రత్యేక శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గోపినాథ్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విశ్వేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాల జ్వరంతో జాగ్రత్త



పాడి పశువు

అశ్రద్ధ చేస్తే ప్రమాదకరం

ముందస్తుగా టీకాలతో నియంత్రణ

కోటవురట్ల: వ్యవసాయంతోనే పాడి పశువు కూడా రైతుకు ఓ మంచి నేస్తమని చెప్పొచ్చు. వ్యవసాయం కలిసి రాకున్నా పాడి మాత్రం నిరంతరం ఆదాయాన్ని ఇస్తూ ఆదుకుంటుంది. మంచి పశువుల ఎంపిక, పశుపోషణ, సంరక్షణ, వ్యాధులు, చికిత్స పట్ల రైతులు అవగాహన కలిగి ఉంటే నష్టాల నుంచి తప్పించుకుని లాభాల బాటలో నడవొచ్చు. పాడి పశువుల్లో అనేక వ్యాధులు సీజనల్‌గా వస్తూ ఉంటాయి. వాటిని సకాలంలో గుర్తించి నివారించడం, ముందస్తుగా టీకాలు వేయించడం చేస్తే సరిపోతుంది. పాడి పశువులకు సోకే పాల జ్వరం పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలి. ఇందుకు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెట్ల నరేష్ వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్స గురించి వివరించారు. ఈనిన మొదటి వారంలోనే పాడి గేదెలు, ఆవులలో ఈ వ్యాధి కనిపిస్తుంది. అధిక పాల ఉత్పత్తి ఉన్న పశువుల్లో పాల జ్వరం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా చాలా మంది రైతులు ఈనిన వెంటనే పాలను పిండేస్తారు. అలా చేయడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి కాల్షియం లోపం కారణంగా వచ్చే అవకాశం ఉంది. జున్నుపాలు, సాధారణ పాలల్లో పశువు శరీరంలోని కాల్షియం శాతం తగ్గిపోవడం వల్ల ఈనిన తర్వాత పాల జ్వరం వస్తుంది.

నివారణ ఇలా..

ఈనిన వెంటనే పశువుల పొదుగును శుభ్రం చేయాలి. ఈనిన వెంటనే పొదుగు నుంచి మొత్తం పాలను పితకకూడదు. పశువు చూడితో ఉండగానే లేదా ఈనిన తర్వాత డాక్టరును సంప్రదించి సలహా మేరకు కాల్షియం, మెగ్నీషియం ఖనిజ లవణాలు తగు మోతాదులో ఇవ్వాలి.

వ్యాధి లక్షణాలు..

వ్యాధి సోకిన పశువులు బాగా నీరసించిపోయి **మేత మేయడం మానేస్తాయి.** అశ్రద్ధ చేస్తే ప్రమా**దకరంగా మారి పశువుకు** తీరని నష్టాన్ని కలగజే**స్తుంది. ఈ వ్యాధి సోకిన** పశువులు ఎక్కువగా కింద **పడిపోవడం, తన్నుకోవడం** చేస్తాయి. కండరాలు **వణకడం** కనిపిస్తాయి. కళ్ల నుండి నీరు **కారుతూ, చెవులు** వాలిపోతాయి. కొన్ని పశు**వుల్లో వ్యాధి తీవ్రత** ఎక్కువగా ఉంటే చూపు మం**దగిస్తుంది. పశువు** చిరాకుగా ఉండి ఉలిక్కి**పడుతూ ఉంటుంది.**

చికిత్స...

వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వీలైనంత తొందరగా డాక్టరును కలిసి కాల్షియం ఇంజక్షన్లు ఇప్పించాలి. ముందుగానే తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి బారిన పడకుండా పశువును కాపాడుకోవచ్చు.

గూడుపమ్మ ఆలయానికి ఆషాఢ శోభ



ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

● వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక

నక్కపల్లి: ఆషాఢ మాసం, ఆదివారం కావడంతో రేబాక గూడుపమ్మ తల్లి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తుని, పాయకరావుపేట, నక్కపల్లి, అడ్డురోడ్డు నర్సీపట్నం, ఎలమంచిలి తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఆది, గురు, మంగళవారాల్లో అమ్మవారి ఆలయానికి భక్తులు వచ్చి కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ ప్రాంగణంలోనే వంటావార్పు చేసుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమవుతారు. ఆలయ ప్రాంగణం పచ్చని వాతావరణంలో విశాలంగా ఉండటం, చుట్టూ ఎత్తయిన కొండల మధ్య అమ్మవారి ఆలయం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి రావడానికి ఎక్కువగా ఇష్టపడతారు. మెరక గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా కొలిచే అమ్మవారి ఆలయం వారాంతపు రోజుల్లో కిటకిటలాడుతోంది.



గూడుపమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అస్తమానం కరెంటు కావాలంటే కుదరదండి

విద్యుత్ ఏడీ నిర్లక్ష్య వైఖరిపై

రామయ్యపట్నం గ్రామస్తుల ఆవేదన

ఎస్.రాయవరం: 'ఇంటింటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావాలంటే పట్టణంలోనైనా ఉండాలి, అవసరమైతే ఇన్వర్టర్ అయినా వేయించుకోవాలి, అంతేగానీ గ్రామాలకు అస్తమానం కరెంటు కావాలంటే కుదరదండి' అంటూ విద్యుత్ ఏడీ నిర్లక్ష్యంగా చెబుతున్నారని రామయపట్నం గ్రామస్తులు ఆదివారం సాక్షితో తమ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి నుంచి గ్రామానికి విద్యుత్ సరఫరా లేదని ఫోన్ ద్వారా ఏడీని అడిగితే తమ సహనాన్ని పరీక్షిస్తున్నారని, నెలలో కొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అసహనం వ్యక్తం చేశారని వాపోయారు. సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో తరచూ విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలపై అధికారులకు ఫోన్ చేస్తుంటే స్పష్టత లేదన్నారు. గతంలో ఎప్పుడు కరెంటు పోయినా అడిగిన వెంటనే సమాధానం చెప్పేవారు, సరఫరా పునరుద్ధరించేవారని, ప్రస్తుతం హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అధికారులు ఇలా ఉంటే, మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో అప్రకటితంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తే, తాము పడే ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ ఉన్నతాధికారులు గ్రామాల్లో విద్యుత్ సరఫరాపై సమీక్షించి సరఫరా సక్రమంగా అయ్యేలా చూడాలని సాగి పాండురంగ వర్మ, మామిడి నాగేశ్వరరావు, గరగా శ్రీనివాస్, మేకల సత్తిబాబు, నేదూరి సత్తిబాబు తదితరులు కోరుతున్నారు.



విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని కోరుతున్న రామయ్యపట్నం గ్రామస్తులు

స్థానిక ఎన్నికల్లో యాతలకు ప్రాధాన్యమివ్వాలి

జిల్లా యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు

పెంకే మారేష్

అనకాపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ ప్రకారం సీట్లు కేటాయించాలని జిల్లా యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే మారేష్ కోరారు. ఆదివారం స్థానిక గాంధీనగరం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో యాతలకు అవకాశం కల్పించాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అమలులో ఉన్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజకీయ రంగంలో లేకపోవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అణగారిన వర్గాల రాజకీయ ప్రయోజనాలను కాపాడే విధంగా బీసీ రిజర్వేషన్లను వర్గీకరించి అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఇతర అణగారిన బీసీ కులాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో యాత కార్పొరేషన్ పాలకవర్గాన్ని నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించడం అన్యాయమన్నారు. యాత కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని, యాత కులస్తుల పిల్లల విద్యాభ్యాసం కోసం ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యాత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు, న్యాయవాది ఒడిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా యాత సంక్షేమ సంఘం నాయకులు

రైతులకు కొబ్బరి, పండ్ల మొక్కలు పంపిణీ

దేవరాపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పండ్ల మొక్కలను ఆదివారం ఉచితంగా అందజేశారు. చెరువు గట్లుపైన నీటి గుంతలు వద్ద నాటేందుకు మొక్కలను సదరు రైతులకు అందజేసినట్టు ఉపాధి ఏపీవో వై. రుక్మిణీదేవి తెలిపారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ సరఫరా చేసిన మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొబ్బరి మొక్కలు–430, సపోటా మొక్కలు–230, మామిడి–240, వేప, బాదం, మహాగని తదితర మొక్కలు 50 చొప్పున సరఫరా కాగా వీటిని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసిరావు తదితర సిబ్బంది రైతులకు అందజేశారు.



దేవరాపల్లిలో పండ్ల మొక్కలను అందజేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసిరావు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం రూరల్ ఫీడర్ గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా ఉండబోదని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. లైనులో చెట్టు కొమ్మలు, మరమ్మతులు కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ కారణంగా ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు హాజరు కావాలని సూచించారు.

చోడమాంబికకు మంగళసూత్రాలు బహూకరణ



చైర్మన్‌కు మంగళసూత్రాలు అందజేస్తున్న శ్రీనువాసరావు, సాంబశివరావు దంపతులు

అచ్యుతాపురం రూరల్: చోడమాంబిక అమ్మవారికి రెండున్నర తులాల మంగళసూత్రాలు నెల్లూరుకు చెందిన తలారి శ్రీనువాసరావు నూకరత్నం, సాంబశివరావు సోమురత్నం దంపతులు బహూకరించారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ వడిశల సన్యాసినాయుడుకు వీటిని అందజేశారు. తొలుత అమ్మవారికి మంగళసూత్రాలు సమర్పించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించారు. అదేవిధంగా ఆషాఢ మాసం సందర్భంగా పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్, ఫిట్‌నెస్‌పై యువతకు అవగాహన



వద్దాదిలో బాడీ బిల్డింగ్ ప్రదర్శన చేస్తున్న యువకుడు

బుచ్చెయ్యపేట : యువత విద్యతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని టీమ్ ఇండియా ఆర్మీ, సర్వీసెస్ కోచ్ టి.శివశంకర్ (ఇతను ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ఆర్మీ ఉద్యోగి) తెలిపారు. ఆదివారం సాయంత్రం వద్దాదిలో ఎస్ఆర్ ఫిట్నెస్ జిమ్‌కోచ్‌లో బాడీ బిల్డింగ్, ఫిట్‌నెస్‌పై యువతకు అవగాహన కల్పించారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే జిమ్ సెంటర్‌లు పల్లె గ్రామీణ ప్రాంతంలో ఫిటెనెస్ సెంటర్ ఏర్పాటు చేసి యువత ఆరోగ్యం, ఫిటెనెస్‌కు ప్రాధాన్యం కల్పించిన జిమ్ నిర్వాహకుడు గండెం వెంకటేష్‌ను అభినందించారు. పలువురు యువకులు బాడీ బిల్డింగ్ ప్రదర్శన చేశారు. జాతీయ బాడీ బిల్డర్ ఎస్.బాబి, ఒలింపియన్ వెయిట్ లిఫ్టర్ ఎం.వి. మాణిక్యాలు తదితరులు బాడీ బిల్డింగ్ చేసే విధానం, ఆహార నియమాలు, ఆరోగ్యం గురించి యువతకు అవగాహన కల్పించారు. బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ చూపిన యువతకు బహుమతులు అందించారు. నాయకులు, ఉపాధ్యాయులు దాడి చిన గోవింద, దొండా నారాయణమూర్తి, వర ప్రసాద్, వడ్డి సత్యారావు, రాంబి పాల్గొన్నారు.

ఊబిలో చిక్కుకొని పాడిగేదె మృతి



రావికమతం : మరుపాకలోని కనుముల చెరువు ఊబిలో చిక్కుకొని పాడి గేదె మృతి చెందింది. మరుపాక పంచాయతీ శివారు దాసరయ్యపాలేనికి చెందిన గంట్ల ప్రసాద్‌కు చెందిన పాడి గేదె ఆదివారం మేతకు తీసుకెళ్లారు. కనుముల చెరువులో నీరు కోసం దిగి ఈదుకుంటూ లోపలికి వెళ్లింది. చెరువులో ఊబి ఉండడంతో దాంట్లో చిక్కుకుంది. ఊబిలో చిక్కుకున్న గేదెను రక్షించేందుకు సమీపంలో ఉన్న రైతులు ప్రయత్నించారు. చాలా సేపటి తర్వాత ఒడ్డుకు చేర్చారు. అప్పటికే గేదె మృతి చెందిందని రైతు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పాడి గేదె రూ. 60 వేలు ఖరీదు చేస్తుందని రైతు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి రాజు

అచ్యుతాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేయాలని యలమంచిలి మాజీ శాసన సభ్యుడు యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) కోరారు. అచ్యుతాపురం కూడలి నుంచి పూడిమడక వెళ్లే రహదారిలోని లేపాక్షి ఫంక్షన్ హాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమవతి హాజరవుతారన్నారు. నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంధకారంలో టిడ్కో కాలనీ



చీకట్లో టిడ్కో కాలనీ

యలమంచిలి రూరల్: పట్టణానికి సమీపంలో టిడ్కో కాలనీలో ఆదివారం రాత్రి 1.30 నుంచి తెల్లవారుజామున 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక్కడ 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పలువురు విద్యుత్ శాఖ కాల్ సెంటర్, స్థానిక సిబ్బందికి ఫోన్లు చేసినా సరఫరా వెంటనే పునరుద్ధరించలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అత్యవసర సేవల్లో ఒకటైన విద్యుత్ సరఫరా విషయంలో ఇక్కడ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న గాలి వీచినా, చినుకులు కురిసినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు విషయంలో నిర్మొహమాటంగా వ్యవహరించే ఆ శాఖ అధికారులు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపిస్తున్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



మహిళకు సుగర్ టెస్ట్ చేస్తున్న వైద్యుడు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కాకివానివీధి సంపత్ సాయి జనరల్ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. యలమంచిలి చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో శిబిరానికి తరలివచ్చి బీపీ, బ్లడ్ సుగర్ పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైన వారికి ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా మందులు అందజేసింది. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఆరు నెలలకొకసారి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యుడు సుతరపు శ్రీకాంత్ సూచించారు.

వార్డు సభ్యుడు మృతికి సంతాపం



సత్యనారాయణ(ఫైల్)

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ 9వ వార్డు సభ్యుడు కాండ్రేగుల సత్యనారాయణ అలియాస్ పెద్ద (48) ఆదివారం మృతి చెందాడు. గత పంచాయతీ ఎన్నికల్లో 9వ వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అతడు వైద్యం పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు, కాండ్రేగుల వెంకటలక్ష్మి, విశ్రాంత తహసీల్దార్ కాండ్రేగుల సూర్యనారాయణ, పార్టీ నేతలు దొడ్డి బాలాజీ, షేక్ ఇస్మాయిల్, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ తదితరులు సంతాప కార్యక్రమంలో పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, పార్టీ శ్రేణులు

విస్తృతంగా కర్ర పెండలం సాగు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో కర్ర పెండలం పంటను విస్తారంగా రైతులు సాగుచేస్తున్నారు. ప్రధానంగా ఈ పంటను మెట్ట ప్రాంత గ్రామాల్లో 100ఎకరాల్లో సాగుచేస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో గల భూములు ఈ పంటకు అనుకూలంగా ఉండి సాగు వల్ల కర్ర పెండలం దుంపలు దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.



గుల్లేపల్లిలో సాగులో ఉన్న కర్రపెండలం పంట